సాక్షి ఖమ్మం

సోమవారం । 7 । ఆగస్టు । 2023



అభివృద్ధికి పెద్దపీట

తాను పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి పనులకే పెద్దపీట వేసినట్లు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. 8లో



ఏజెన్సీ రైతులకు శుభవార్త

ఏజెన్సీలోనూ వ్యవసాయ భూములు గల రైతులకు అన్ని రకాల రుణాలు పొందేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. 10లో

గరిష్టం / కనిష్టం 34° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణపుష్పార్చన



నిత్యకల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు.

బీసీ హాస్టల్‌లో అదనపు కలెక్టర్ తనిఖీ

తల్లాడ: మండలంలోని మల్లవరం బీసీ హాస్టల్‌ను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు.. ఎంత మంది హాజరవుతున్నారు.. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా తదితర విషయాలు వార్డెన్ విష్ణును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు తగ్గట్టుగా నిత్యావసర సరుకులు లేకపోవటంతో వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

పర్యావరణంపై ప్రత్యేక సిలబస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి విద్యా సంస్థ ఆధ్వర్యంలో ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్న కళాశాలలు, పాఠశాలల్లో పర్యావరణంపై ప్రత్యేక సిలబస్‌ను బోధించనున్నట్లు సంస్థ డైరెక్టర్ (పా, ఫైనాన్స్) ఎస్.బలరామ్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొఆన్నారు. ప్రతి తరగతి నుంచి చురుకైన విద్యార్థిని కెప్టెన్‌గా ఎంపిక చేస్తామని, వ్యాయామ ఉపాధ్యా యుల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని వివరించారు. డబ్ల్యూ.డబ్ల్యూ.ఎఫ్ వాచర్స్, తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖల నుంచి సమాచారాన్ని సేకరించి సిలబస్ రూపొందిస్తామని తెలిపారు. ప్రతివారం పర్యావరణ హిత కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. కాగా సింగరేణి ఎడ్యుకేషన్ విభాగం జీఎం ఆదివారం అన్ని పాఠశాలలు, కళాశాలలకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రశాంతంగా అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం మహిళా కళాశాలలో ఆదివారం నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఈ అండ్ ఎం) గ్రేడ్ -2 రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఖాళీగా ఉన్న 24 పోస్టులకు గత మార్చిలో నోటిఫికేషన్ విడుదల చేయగా, సుమారు 600 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు 573 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య పర్యవేక్షించారు. పరీక్ష ఫలితాలు ఆదివారం సాయంత్రమే వెల్లడించగా, 441 మంది అభ్యర్థులు అర్హత సాధించారని జీఎం తెలిపారు. మెరిట్, ఆర్‌అండ్‌ఆర్ నిబంధనల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

పొలిటికల్ టెండర్!

మద్యం దుకాణాలపై నేతల కన్ను

- ఎన్నికల నేపథ్యంలో అనుచరులతో దరఖాస్తులు
- సరిహద్దు షాపులకు డిమాండ్‌పై సందిగ్ధం
- గతంలో కన్నా తక్కువ దరఖాస్తులు వచ్చే అవకాశం
- సిండికేట్‌తో పూడనున్న లోటు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: మద్యం టెండర్లపై రాజకీయ ప్రభావం పడుతోంది. పలు పార్టీల నేతలు ఈసారి తమ అనుచరులతో టెండర్లు వేయించేందుకు అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు. వచ్చే నవంబర్‌తో మద్యం పాలసీ ముగుస్తుండగా.. ప్రభుత్వం ముందుగానే రిజర్వేషన్లు ఖరారు చేసి షాపులకు వేలం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న నేతలు సిండికేట్‌తో దుకాణాలు దక్కించుకునే తెర చాటు ప్రయత్నాల్లో మునిగారు. మద్యం దుకాణాలను దక్కించుకోవడం ద్వారా ఎన్నికల్లో లాభపడాలనే వ్యూహంతో చక్రం తిప్పుతున్నారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈసారి జిల్లా సరిహద్దు మండలాల్లో మద్యం దుకాణాలకు ఎన్ని దరఖాస్తులు వస్తాయనే దానిపైనే అందరి దృష్టీ ఉంది. ప్రతిసారి ఈ దుకాణాలకు దరఖాస్తులు అధికంగా వస్తుంటాయి. ఆంధ్రా మద్యం వ్యాపారులు కూడా టెండర్లు దాఖలు చేయడమే ఇందుకు కారణం. ఈసారి దీనిపై కొంత సందిగ్ధత నెలకొంది. అయితే జిల్లాలోని సరిహద్దు షాపులకు దరఖాస్తులు తగ్గినా.. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నేతల అనుచరులు హోరాహోరీగా వేసే దరఖాస్తులతో ఆలోటు పూడే అవకాశాలున్నాయి.

ఆ ఒరవడి కొనసాగేనా..

మద్యం టెండర్లు నిర్వహించిన ప్రతిసారి సరిహద్దు మండలాల్లో మద్యం దుకాణాలకు అత్యధిక దరఖాస్తులు రావడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి మాత్రం పరిస్థితిలో మార్పు వచ్చేలా కనిపిస్తోంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో మద్యం రేట్లు అత్యధికంగా ఉండటంతో ఆంధ్రాకు సరిహద్దులో ఉండే జిల్లాలోని మండలాల్లో అక్కడి వ్యాపారులు టెండర్లు దాఖలు చేసేవారు. అయితే ఈసారి అక్కడ కూడా ధరలు తగ్గించడంతో ఆ ప్రభావం అంతగా ఉండదని జిల్లాకు చెందిన మద్యం వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రాలో ధరలు తగ్గిన కారణంగా అక్కడే టెండర్లు వేసేందుకు వ్యాపారులు మొగ్గు చూపుతారని అంటున్నారు. ఇక త్వరలోనే తెలంగాణతోపాటు ఆంధ్రాలోనూ ఎన్నికలు ఉండడం కూడా అక్కడి మద్యం వ్యాపారులను ఆలోచనలో పడేసినట్లు తెలుస్తోంది. ఇక్కడ టెండర్లు వేస్తే మళ్లీ అక్కడ కూడా వేయాలంటే భారీ ఖర్చుతో కూడుకున్న పని అని కొందరు మీమాంసలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సరిహద్దు మండలాల్లో గతంలో వచ్చినన్ని దరఖాస్తులు ఈసారి రావనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనా 15వ తేదీ తర్వాతే టెండర్ల ప్రక్రియ ఊపందుకుంటుందని తెలుస్తోంది. అప్పటి వరకు వ్యాపారులు పరిస్థితిపై అంచనాకు వస్తారనే చర్చ జరుగుతోంది. చివరి రెండు రోజుల్లో దరఖాస్తుల సమర్పణ ఎక్కువగా ఉండనుంది.

ఎన్నికలపై నజర్‌తో..

ఈ ఏడాది చివరిలో ఎన్నికలు ఉండటంతో మద్యం దుకాణాల టెండర్ల వ్యవహారంపై రాజకీయ పార్టీల నేతలు దృష్టి సారించారు. ఇప్పుడే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కావడం.. ఈనెల 18 వరకు సమయం ఉండటంతో ఈలోపు ఏ షాపులకు, ఎవరితో టెండర్లు దాఖలు చేయించాలనే దానిపై తమ అనుచరులతో చర్చిస్తున్నట్లు సమాచారం. పొలిటికల్ సిండికేట్ ద్వారా అత్యధిక దుకాణాలను పొందేందుకు రాజకీయ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. ప్రధానంగా తమ నియోజకవర్గాల్లోని షాపులకు ఇతర నేతలు అడ్డు రాకుండా ఇప్పటి నుంచే సర్దుబాటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. సిండికేట్‌గా ఏర్పడి ఒకరికి ఒకరు పోటీ కాకుండా ఉండాలనే నిర్ణయానికి వచ్చినట్లు జిల్లాలో చర్చ సాగుతోంది. 2021లో జిల్లాలోని 122 దుకాణాలకు 6,212 దరఖాస్తులు రాగా.. వీటి ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.124 కోట్ల ఆదాయం వచ్చింది. రాజకీయ పార్టీల నేతల అనుచరులు వేసే టెండర్లతో ప్రభుత్వానికి ఈసారి కూడా ఆదాయం గణనీయంగా ఉండే అవకాశాలున్నాయి.

సరిహద్దు షాపులకే..

మద్యం టెండర్లలో ఏపీ సరిహద్దులో ఉండే దుకాణాలకే గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ఈ షాపులను దక్కించుకునేందుకు విపరీతంగా పోటీ పడుతుంటారు. మధిర, సత్తుపల్లి, బోనకల్‌తోపాటు ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని షాపులపైనే అందరూ దృష్టి సారిస్తారు. 2021లో జరిగిన మద్యం టెండర్లలో కూడా మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఈ స్టేషన్ పరిధిలోని 85వ నంబర్ షాపు కోసం 121 మంది టెండర్లు వేశారు. ఇదే ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 77వ నంబర్ షాపునకు 119 టెండర్లు వచ్చాయి. నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 45వ నంబర్ షాపునకు కూడా 119 దరఖాస్తులు వచ్చాయి. ఈ షాపుల కోసం స్థానిక మద్యం వ్యాపారులతోపాటు ఆంధ్రాలోని మద్యం వ్యాపారులు కూడా పోటీ పడ్డారు. ప్రధానంగా ఏపీకి చెందిన వ్యాపారులు టెండర్లు వేయడంతో ఇప్పటి వరకు అత్యధిక దరఖాస్తులు ఈ సరిహద్దు మండలాల దుకాణాలకే వచ్చాయి.

2021లో అత్యధికంగా దరఖాస్తులు వచ్చిన షాపుల వివరాలు..

ఎక్సైజ్ స్టేషన్	షాపు నంబర్	దరఖాస్తులు
మధిర	85	121
మధిర	77	119
నేలకొండపల్లి	45	119
ఖమ్మం-1	22	90
సత్తుపల్లి	109	90
సత్తుపల్లి	105	86
మధిర	81	85
ఖమ్మం-2	36	85
ఖమ్మం-1	23	84
సత్తుపల్లి	103	81

జయశంకర్ తెగువ మరువలేనిది

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ భావజాల వ్యాప్తికి జీవిత కాలం కృషి చేసిన ఆచార్య జయశంకర్ సార్ అందించిన ప్రోత్సాహం, తెగువ యావత్ తెలంగాణ ప్రజలు మరిచిపోలేనివని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జయశంకర్ జయంతి సందర్భంగా అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో పాటు సుదీర్ఘ కాలం ఉద్యమించిన జయశంకర్ ఎన్నో విలువైన సూచనలు చేశారని కొనియాడారు. ఎంతో మేధో సంపత్తి కలిగిన వ్యక్తి అయినా నిరాడంబర జీవితం గడిపారని నివాళులర్పించారు. ఎంతో ముందుచూపు కలిగిన వ్యక్తి అని, ఆయన ఆశయాలకు అనుగణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగుతోందని తెలిపారు.

ఇంద్రధనుష్‌కు వేళాయె..

- నేటి నుంచి ఈనెల 12 వరకు కార్యక్రమాలు
- జిల్లాలో గుర్తించిన 1,717 మందికి టీకాలు
- నూరుశాతం లక్ష్యంతో ముందుకు



ఖమ్మం వైద్యవిభాగం : చిన్నారులు, గర్భిణుల్లో వివిధ రకాల వ్యాధుల నివారణకు టీకాలు వేసే 'మిషన్ ఇంద్రధనుష్' సోమవారం ప్రారంభం కానుంది. ఈనెల 12 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం, పోలియో, తట్టు, బాల్యంలో క్షయ, హెపటైటిస్ బి, మెనింజైటిస్, న్యూమోనియా, రోట వైరస్ డయేరియా, జపనీస్ ఎన్సెఫాలిటిస్ వంటి వ్యాధులతో పాటు చికెన్‌పాక్స్, హెపటైటిస్ ఏ, మిజిల్స్, పోలియో, బీసీజీ తదితర టీకాలు వేయనున్నారు. జిల్లాలో ఇటీవల టీకాలు వేయించుకోకుండా మిగిలి పోయిన చిన్నారులు, గర్భిణులను గుర్తించి నూరు శాతం టీకాలు వేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు చెందిన వారు, సంచార జాతులు, ఇటుక బట్టీ కార్మికులు తదితర కుటుంబాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

31 సెంటర్లలో టీకాలు..

ఐదో విడత ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా గుర్తించిన వారితో పాటు కొత్త వారుంటే కూడా టీకాలు వేయనున్నారు. అందుకోసం వివిధ వ్యాధులకు సంబంధించిన వ్యాక్సిన్‌లు జిల్లాకు చేరగా వాటిని వివిధ సెంటర్లకు పంపిణీ చేశారు. జిల్లాలోని 26 పీహెచ్‌సీలు, నాలుగు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ఒక పీపీ యూనిట్‌లో టీకాలు వేయనున్నారు.

1,717 మంది చిన్నారులు, గర్భిణులకు..

ప్రస్తుతం జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 1,14,802 మంది ఉన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నిర్వహించిన ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా టీకాలు వేయించుకున్న వారు మినహా ఇంకా మిగిలిన వారికి టీకాలు వేయనున్నారు. వారిలో చిన్నారులు, గర్భిణులు 1,717 మంది ఉన్నట్లు గుర్తించారు. వారిలో రెండేళ్ల లోపు వారు 948 మంది, 2 నుంచి ఐదేళ్ల లోపు వారు 511 మంది, గర్భిణులు 258 మంది ఉన్నారు. వీరేకాక కొత్తగా ఎవరైనా జిల్లాకు వచ్చినా, ఇంతకు ముందు గుర్తించని వారు ఉన్నా అందరికీ టీకాలు వేయనున్నారు. నేటి నుంచి ఈనెల 12 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుండగా, సెప్టెంబర్ 11 నుంచి 6 రోజులు, అక్టోబర్ 9 నుంచి 6 రోజులు కూడా నిర్వహించనున్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

జిల్లాలో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ మాలతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం నుంచి ఈ నెల 12 వరకు అన్ని ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలు 1459, గర్భిణులు 258 మందిని గుర్తించామని, వీరి కోసం అర్బన్ ఏరియాల్లో 61, రూరల్ ఏరియాల్లో 476 సెషన్‌లు టీకాలు వేస్తామని వివరించారు. జిల్లాలో నూరుశాతం టీకాలు వేసేందుకు వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బందితో పాటు అన్ని శాఖల అధికారులు సహకరించాలని, తల్లిదండ్రులు, ప్రజలు, నాయకులు, మహిళా సంఘాలు బాధ్యత తీసుకోవాలని కోరారు.

జిల్లాతో గద్దర్‌కు ప్రత్యేక అనుబంధం



ఖమ్మం జనగర్జన సభలో రాహుల్ గాంధీని ముద్దాడుతున్న ప్రజా గాయకుడు గద్దర్ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్ : పేదల బతుకు చిత్రం, దగాపడిన తెలంగాణ, విప్లవకారులపై పాటలు రాసి, పాడుతూ సామాన్యులను సైతం కదిలించిన కవి, ప్రజా గాయకుడు గద్దర్‌కు జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. జిల్లాలో జరిగిన అనేక సభల్లో, ఇతర కార్యక్రమాల్లో పాటలు పాడి ప్రజలను ఉర్రూతలూగించారు. జిల్లాలో జననాట్యమండలి ప్రభావం అంతగా లేకున్నా.. ఆయన పాటలు, మాటలు ఆకట్టుకున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చింతకాని మండలం నాగులవంచలో గద్దర్ తన ఆటపాటలతో అలరించారు. ముఖ్యంగా తెలంగాణ బతుకు చిత్రంపై ప్రదర్శించిన నాటకం విశేషంగా ఆకట్టుకుంది. చివరిగా ఖమ్మంలో కాంగ్రెస్ నిర్వహించిన జనగర్జన సభలో పాల్గొన్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్రకు సంఘీభావం తెలిపిన ఆయన జూలై 2న ఎస్‌ఆర్ గార్డెన్ వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీతో కలిసి వేదికను పంచుకున్నారు. వేదికపై రాహుల్ గాంధీని ముద్దాడి అందరినీ ఆకర్షించారు. ఖమ్మానికి చెందిన కోమలి-విజయ్ ఉస్మానియ యూనివర్సిటీలో చదువుకుంటూ ఆదర్శ వివాహం చేసుకున్నారు. వరవరరావు, ఆర్.నారాయణమూర్తితో కలిసి గద్దర్ వీరి వివాహాన్ని జరిపించారు. ఇక అరోణదయ నాగన్నతో కూడా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గద్దర్ మృతి పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. గద్దర్ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

ఆశలు గల్లంతే..

- ఎనిమిది నెలలుగా పత్తి నిల్వ చేసిన రైతులు
- గతేడాది రూ. 13 వేలు పలికిన ధర
- ఇప్పుడు రూ. 6 నుంచి రూ.7 వేలకు పడిపోయిన వైనం
- పెట్టుబడుల కోసం తప్పని విక్రయం



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన పత్తి

ఖమ్మంవ్యవసాయం: పత్తి ధరపై రైతుల ఆశలు గల్లంతయ్యాయి. పంట సీజన్‌లో ఉన్న ధర కూడా ప్రస్తుతం లేదు. మునుపెన్నడూలేని విధంగా గతేడాది మే నెలలో పత్తి ధర క్వింటా రికార్డు స్థాయిలో రూ.13 వేలు పలికింది. ఈ ఏడాది కూడా ఆ ధర వస్తుందనే ఆశతో రైతులు నిల్వ పెట్టుకోగా క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ. 6 నుంచి 7 వేలకు పడిపోయింది. ప్రసుతం వానాకాలం సీజన్ ప్రారంభం కాగా పంటల సాగు పెట్టుబడులకు అవసరాలు పెరిగాయి. దీంతో ఇళ్లలో నిల్వపెట్టిన పత్తిని అమ్ముకోక తప్పని పరిస్థితి నెలకొంది. నెలల తరబడి దాచినా కనీసం సీజన్‌లో పలికిన ధర కూడా లేదని రైతులు దిగులు చెందుతున్నారు. జిల్లాలో ప్రధానంగా సాగు చేసే పంటల్లో వరి తర్వాత స్థానం పత్తిదే. గతేడాది జిల్లాలో 2,21,600 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అధిక వర్షాలు, తెగుళ్లు, తదితర కారణాలతో దిగుబడి గణనీయంగా తగ్గింది. నీటి పారుదల ప్రాంతాల్లో ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు రాగా, వర్షాధారంగా పండించిన ప్రాంతాల్లో 5 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. జిల్లాలో రైతులు పండించిన పంటలో 30 శాతానికి పైగా పత్తి నిల్వలు ఉన్నట్లు అంచనా. అంటే ఇంకా 3 లక్షల క్వింటాళ్ల వరకు నిల్వ ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖమ్మం మార్కెట్‌కు రోజూ నాలుగు నుంచి ఐదు వేల బస్తాలు విక్రయానికి వస్తున్నాయి.

సీజన్‌లో రూ.10 వేలకు పైగా..

అక్టోబర్, నవంబర్ నుంచి పత్తి సీజన్ ప్రారంభమవుతుంది. గతేడాది ఈ సీజన్‌లో పత్తి ధర రూ.10 వేలు, ఆపైన పలికింది. నవంబర్ 21న ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.10,529గా నమోదైంది. దీంతో రైతులకు ధరపై మరిన్ని ఆశలు రేకెత్తాయి. ధరను చూసి పంట విక్రయాలు పెరుగుతాయని వ్యాపారులు ఆశించారు. కానీ అందుకు భిన్నంగా రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. మున్ముందు ధర వస్తుందనే ఆశతో పంట విక్రయించలేదు.

జనవరి నుంచి పతనం

గత డిసెంబర్ వరకు రూ.9 నుంచి 10 వేల వరకు పలికిన ధర ఈ ఏడాది జనవరి నుంచి క్రమంగా పతనమవుతూ వచ్చింది. జనవరిలో రూ. 8వేలకు పడిపోగా ఫిబ్రవరిలో రూ. 7,700, మార్చిలో రూ.7,300, ఏప్రిల్, మే నెలల్లో రూ.7 వేలు పలికిన ధర జూన్, జూలై, ఆగస్టులో నేటి వరకు రూ. 6 నుంచి 7 వేల మధ్యనే కొనసాగుతోంది. వానాకాలం పంటల సాగుకు డబ్బు అవసరం కావడంతో ఆశించిన ధర లేకపోయినా రైతులు పంటను విక్రయిస్తున్నారు.

విదేశీ ఎగుమతులు లేకనే..

విదేశాల్లో పత్తి పంట ఆశాజనకంగా ఉండటం, మన దేశం నుంచి ఎగుమతులు లేకపోవటంతో ధరపై ప్రభావం పడింది. దీనికి తోడు పత్తి బేరన్లు, బేళ్లు, బట్టలు ఇతర దేశాల నుంచి ఆశించిన మేరకు ఆర్డర్లు లేకపోవటం, పత్తి గింజల ధర గణనీయంగా పడిపోవటం కూడా ధర పతనానికి ప్రధాన కారణాలని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. పంట సీజన్‌లో పత్తి గింజల(సీడ్) ధర క్వింటా రూ. 4,700 ఉండగా, ప్రస్తుతం అన్ సీజన్ అయినప్పటికీ రూ. 2,800 మాత్రమే పలుకుతోంది. ఇక దారం ధర కిలో ఒక్కంటికి సీజన్‌లో రూ. 380 ఉండగా ప్రస్తుతం రూ. 230 ఉంది.

గత ఏడాది, ఈ ఏడాది పత్తి ధరలు (క్వింటాకు.. రూ.ల్లో)

నెల	2022	2023
జనవరి	9,000	8,300
ఫిబ్రవరి	10,000	7,700
మార్చి	11,000	7,300
ఏప్రిల్	12,000	7,500
మే	13,000	7,200
జూన్	12,000	7,000
జూలై	12,000	6,900
ఆగస్టు	12,000	6,900

రూ.10 వేలకు అడిగితే అమ్మలేదు



గత ఏడాది రెండెకరాల్లో పత్తి సాగు చేశా. 14 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఏడు కింటాళ్ల పత్తి రూ. 8 వేల చొప్పున అప్పుడే అమ్మా. మిగితా 7 క్వింటాళ్లు ధర వస్తుందనే ఆశతో నిల్వ పెట్టా. డిసెంబర్‌లో వ్యాపారులు రూ. 10 వేల చొప్పున అడిగారు. ఇంకా ధర వస్తుందనే ఆశతో అమ్మలేదు. ఇప్పుడు ఖమ్మం మార్కెట్‌కు తీసుకొస్తే రూ.6,900కే తీసుకున్నారు.

– దేగల తిరుపతయ్య, పెద్దమునగాల, కొణిజర్ల మండలం

నిల్వ చేసి నష్టపోయాం



పత్తి పంట నిల్వ చేసి నష్టపోయాం. రెండకరాల్లో పంట సాగు చేశా. నీటి వనరులు ఉండడంతో 20 క్వింటాళ్ల పంట పండింది. సీజన్‌లో 10 క్వింటాళ్లు విక్రయించగా రూ.7,300 చొప్పున ధర పలికింది. మిగితా 10 క్వింటాళ్లు ప్రస్తుతం విక్రయానికి తీసుకు రాగా రూ. 6,700కు అడిగారు. వానాకాలం పంటలకు పెట్టుబడుల కోసం అమ్మక తప్పలేదు. నిల్వ చేయడంతో భారీగా నష్టపోయాం.

– షేక్ సిద్దయ్య, నాగిలికొండ, చింతకాని మండలం

ఎగుమతులు లేనందునే..



మునుపెన్నడూ లేని విధంగా పత్తి ధర తిరోగమనంలో పయనించింది. దీనికి ప్రధాన కారణం విదేశీ ఎగుమతులు లేకపోవడమే. అన్‌సీజన్‌లో ధర పతనం కావటం ఊహించనది. రైతులతో పాటు వ్యాపారులు కూడా నష్టపోయారు. రైతుల మాదిరిగానే వ్యాపారులు కూడా ధరపై ఆశతో నిల్వ పెట్టారు. అమ్మకానికి సరుకున్నా దేశీయంగా, విదేశాల నుంచి ఆర్డర్లు లేవు.

– రామా శ్రీను, ఖరీదుదారు, ఖమ్మం

ఇక మెరుగైన సౌకర్యాలు

- రైల్వే స్టేషన్‌లో 'అమృత్ భారత్'
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



ఖమ్మం స్టేషన్‌లో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న సుధాకర్‌రెడ్డి, రైల్వే అధికారులు, సిబ్బంది

ఖమ్మం మామిళ్లగూడెం : ఖమ్మం రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్టేషన్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కాకపోవడంతో బీజేపీ నాయకుల ఆహ్వానం మేరకు పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య, స్వాతంత్ర్య సమరయోధులు సీతారాములు, వీరయ్యతో పాటు బీజేపీ తమిళనాడు సహ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తదితరులు వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ ఖమ్మం, కొత్తగూడెం, మధిర స్టేషన్లలో రూ.76 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ స్కూల్, కేంద్ర విద్యాలయ పిల్లలకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీఈఎన్ భార్గవ్ సజ్జా, సీసీఐ ఎండీ.జాఫర్, ఎస్‌ఎంజీఎంవీ ప్రసాద్, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి, టెలికాం ఎస్‌ఎస్‌వీ శ్రీనివాస్, ఐఓడబ్ల్యూ ద్రోణాచార్య, ఎస్‌ఎస్‌ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మధిర రైల్వే స్టేషన్‌లో..

మధిర: తెలంగాణకు తొలివాకిలిగా ఉన్న మధిర రైల్వే స్టేషన్‌కు చారిత్రక నేపథ్యం ఉందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. అమృత్ భారత్ పథకంలో ఎంపికైన రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో సర్దార్ జమలాపురం కేశవరావు, మిర్యాల నారాయణగుప్త వంటి ఎంతోమంది త్యాగధనులు మధిర ప్రాంత వాసులు ఉన్నాయని అన్నారు. ఇలాంటి చారిత్రక నేపథ్యం కలిగిన మధిర రైల్వే స్టేషన్ అమృత్ పథకానికి ఎంపిక కావడం హర్షణీయమని తెలిపారు. ఈ నిధులతో ప్రయాణికులకు సదుపాయాలు పెరుగుతాయని తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జి కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మల్లాది వాసు, రైల్వే అధికారులు ప్రథమేష్, రాయప్ప, సుధీర్ బాబు, పద్మారావు, నాయకులు మల్లాది హనుమంతరావు, పెరుమాళ్లపల్లి విజయరాజు, ఏలూరి నాగేశ్వరరావు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి, రైల్వే సిబ్బంది చల్లా నాగిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిద్దె తోటలతో బహుళ ప్రయోజనం



మిద్దె పెంపకందారులతో మాట్లాడుతున్న రఘోత్తంరెడ్డి

ఖమ్మంవ్యవసాయం: మిద్దె తోటల పెంపకంతో అనేక ప్రయోజనాలున్నాయని ఆ తోటల పెపకం నిపుణుడు తుమ్మేటి రఘోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కవిరాజ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఖమ్మం జిల్లా మిద్దె తోటల పెంపకందారుల సదస్సు జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. మిద్దె తోటలతో రసాయనిక ఎరువులు లేని ఆహారం దొరుకుతుందని, దీంతో కేన్సర్ వంటి రుగ్మతల బారిన పడకుండా ఉండొచ్చని తెలిపారు. మిద్దె తోటల పెంపకందారులకు ప్రభుత్వం ఇంటి పన్నులో రాయితీ కల్పించాలని కోరారు. సూర్యాపేట జిల్లాలో విత్తనాలు, ఎరువులు, గ్రో బ్యాగ్స్ సబ్సిడీపై ఇచ్చిన విధంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు మిద్దె తోటల పెంపకందారుల సందేహాలకు గ్రామ బజార్ సీఈఓ దుర్గాప్రసాద్ సమాధానాలిచ్చారు. ఖమ్మానికి చెందిన కోసూరు ప్రసాద్, కుటుంబాక మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మిద్దె తోటల పెంపకందారులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడు హల్‌చల్

వెంటపడి ముగ్గురిపై దాడి

నేలకొండపల్లి: మద్యం మత్తులో ఓ యువకుడు ప్రధాన సెంటర్‌లో వీరంగం సృష్టించి, ముగ్గురిపై దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన యువకుడు విజయ్ ఆదివారం రాత్రి ప్రధాన సెంటర్‌కు వచ్చి కనపడ్డ వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ వెంటపడ్డాడు. పట్టణానికి చెందిన ఓ జేసీబీ డ్రైవర్, స్వీట్ షాపు నిర్వాహకుడు, గ్రామానికి చెందిన మరో యువకుడిపై దాడి చేశాడు. ఏం జరుగుతోందో తెలియక ప్రయాణికులు ఆందోళన చెందారు. వారిపై కూడా దాడి చేస్తాడేమోనని భయంతో పరుగులు తీశారు. అడ్డుకోబోయిన వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న యువకుడిని వారి బంధువులు ఇంటికి తీసుకెళ్లారు. తమపై అకారణంగా దాడి చేశాడని బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

కేసులు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమత రోడ్డులో వెళ్తున్న సైక్లిస్ట్ సీహెచ్ సాయికుమార్‌ను ఈ నెల 3వ తేదీన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీనిపై ఆదివారం ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రయ్యనగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే సాయికుమార్ ఈ నెల 3న సైకిల్‌పై మమత రోడ్డులో వస్తుండగా ద్విచక్రవాహనదారులు వేగంగా వచ్చి ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అలాగే, నగరంలోని 3వ డివిజన్ జయనగర్ వద్ద ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రోడ్డులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి బాబాయి ఫిర్యాదు మేరకు ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఈ నెల 5న బల్లేపల్లిలో ఉండే సునీల్ తన ద్విచక్రవాహనంపై ఖమ్మంకు వస్తుండగా సందులో నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. సునీల్ తీవ్రంగా గాయపడగా హుటాహుటిన హైదరాబాద్ తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



పక్కకు ఒరిగిపోయిన బస్సు

అశ్వారావుపేటరూరల్: ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుకు తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు, ప్రయాణికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులతో అశ్వారావుపేటకు వస్తున్న పల్లెవెలుగు బస్సు మండలంలోని అచ్యుతాపురం స్టేజీ దాటిన తర్వాత అటవీ ఉద్యాన పరిశోధన కేంద్రం సమీపంలో ఎదురుగా దూసుకొచ్చిన లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి పక్కన ఉన్న చిన్నపాటి లోయలోకి దూసుకెళ్లి ఒరిగిపోయింది. ప్రయాణికులు ఒక్కసారిగా భయందోళనతో కేకలు పెట్టారు. అప్రమత్తమైన డ్రైవరు బస్సును అదుపుచేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో డ్రైవరు, కండక్టర్‌తోపాటు 42 మంది ప్రయాణికులున్నారు. వారంతా సురక్షితంగా బయట పడటంతో ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకొని, ప్రయాణికులను మరో బస్సులో అశ్వారావుపేటకు తరలించారు. బస్సు స్వల్పంగా దెబ్బతిన్నది.

కాంట్రాక్టర్లకు లాభాలు.. అధికారులకు మామూళ్లు..



మణుగూరులోని బీటీపీఎస్ కర్మాగారం

సమిధలవుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

- తక్కువ వేతనాలు, పని భద్రత కరువు
- సంక్షేమం గాలికి వదిలేసిన యాజమాన్యం
- రక్షణ లేక ప్రాణాలు కోల్పోతున్న కార్మికులు
- ఇదీ భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ దుస్థితి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రానికి వెలుగులు విరజిమ్ముతున్న భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కార్మిక కుటుంబాల జీవితాల్లో మాత్రం చీకట్లు చిమ్ముతోంది. కాంట్రాక్టర్ల కాసుల కక్కుర్తి, అధికారుల మామూళ్ల మత్తు వంటి కారణాలతో ఇక్కడి కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు గాలిలో దీపాల్లా మారిపోయాయి.

పట్టని కార్మిక సంక్షేమం

తెలంగాణ వచ్చాక జిల్లాకు దక్కిన అతి పెద్ద పరిశ్రమ భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్). మణుగూరు, పినపాక మండలాల పరిధిలో సుమారు 936 ఎకరాల స్థలంలో సుమారు రూ. 3 వేల కోట్లతో పనులు చేపట్టారు. సబ్ క్రిటికల్ టెక్నాలజీని అనుసరిస్తూ (270/4) 1080 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ నిర్మించారు. 2015లో మొదలైన పనులు 2020 వరకు కొనసాగాయి. ఆ తర్వాత ఒక్కో యూనిట్ విద్యుదుత్పత్తి చేస్తూ జాతికి అంకితమైంది. అప్పటినుంచి ఇప్పటివరకు విద్యుదుత్పత్తి మీద ఉన్న శ్రద్ధ, కార్మికుల సంక్షేమంపై లేకుండా పోయింది. ఇటీవల ప్లాంటులో జరిగిన ప్రమాదమే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. బాయిలర్లకు మరమ్మతులు నిర్వహిస్తూ బిహార్‌కు చెందిన వలస కార్మికుడు సచిన్ దుర్మరణం పాలయ్యాడు. ప్రమాదం జరిగిన వెంటనే మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పిన పెద్దలు ఆ తర్వాత నామమాత్రంగా సాయం చేసి చేతులు దులుపుకున్నారు.

లాభాలు.. లంచాలు!

బీటీపీఎస్‌లో సచిన్ ఉదంతం అనేక సందేహాలను లేవనెత్తింది. ఇక్కడ పని చేస్తున్న కార్మికుల సంక్షేమం, భద్రత విషయంలో డొల్లతనాన్ని ఎత్తి చూపింది. బీటీపీఎస్‌లో వెయ్యి మందికి పైగా రెగ్యులర్ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరు కాకుండా ప్లాంటులో పారిశుద్ధ్యం, బొగ్గు ఎత్తడం, కోల్ కన్వేయర్ బెల్ట్ క్లీనింగ్, హౌస్ కీపింగ్, ప్లాంటేషన్, యంత్రాలను శుభ్రంగా ఉంచడం తదితర పనుల కోసం నిత్యం ఎనిమిది వందల నుంచి వెయ్యి మంది కార్మికుల అవసరం ఉంది. ఈ శ్రామిక శక్తిని సరఫరా చేసేందుకు బీటీపీఎస్‌లో మొత్తం 17 మంది కాంట్రాక్టర్లు ఉన్నారు. వీరిలో చాలా మంది కాంట్రాక్టర్లకు లాభాలపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదనే విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్లు లాభాలు చూసుకుంటుంటే దీన్ని సరిచేయాల్సిన ప్లాంటు అధికారులు మామూళ్ల మత్తులో మునిగి ఉంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

అరకొర వేతనాలు..

కాంట్రాక్ట్ పద్ధతిలో వివిధ సంస్థల్లో పని చేసే కార్మికులకు జీతాల చెల్లింపులపై కచ్చితమైన నిబంధనలు ఉన్నాయి. వీటి ప్రకారం స్కిల్డ్ కార్మికులకు రూ. 19,000 , సెమీ స్కిల్డ్ కార్మికులకు 17,000, అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.15,000లు జీతం ఇవ్వాలి. వీటితోపాటు కార్మికులకు కచ్చితంగా ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) చెల్లించాలి. ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలి. ప్రమాదం జరిగితే బాధిత కుటుంబాన్ని ఆదుకునేలా గ్రూప్ ఇన్సురెన్స్, ఇతర బీమాలు కూడా చేయించాలి. కానీ బీటీపీఎస్‌లో ఇవేమీ అమలు కావడం లేదు. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్ అనే తేడా లేకుండా ఏ ఒక్క కార్మికుడి నెల జీతం రూ.10,000 దాటడం లేదు. రోజుకు రూ.300ల నుంచి రూ.400 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. కాంట్రాక్టర్ల కింద ఉన్న ప్రతీ కార్మికుడికి నెలలో కనీసం 24 రోజులపాటు పని దొరుకుతుందన్న గ్యారెంటీ లేదు. ఇక పీఎఫ్ చెల్లింపులు సైతం అరకొరగానే జరుగుతున్నాయి. పీఎఫ్‌లలో జరుగుతున్న మోసాలపై బీటీపీఎస్ క్యాంటీన్‌లో పని చేసిన ఓ కాంట్రాక్టు కార్మికుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం గమనార్హం.

రక్షణ చర్యలు శూన్యం

భారీ పరిశ్రమల కేటగిరీలోకి భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ వస్తుంది. బొగ్గు మండించడం, నీటిని వేడి చేయడం, ఆవిరితో టర్బైన్లు తిప్పడం ఇలా ప్రతీ పనిలో భారీ యంత్రాలు ఉంటాయి. వందల మీటర్ల ఎత్తు కలిగిన కూలింగ్ టవర్లు, చిమ్నీలు ఉంటాయి. వీటికి రెగ్యులర్‌గా మరమ్మతులు చేయాలి. ఇలా ప్లాంటులో అన్ని చోట్ల అడుగడుగునా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. దీంతో ప్లాంటులో పని చేసే కార్మికుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. హెల్మెట్లు, షూస్, గ్లౌవ్స్, సేఫ్టీ బెల్ట్స్, రోప్‌లు ఇలా ఏ ఒక్క విషయంలోనే రాజీ లేని విధంగా భద్రత కల్పించాలి. కానీ బీటీపీఎస్‌లో కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అరకొర జీతాలు ఇచ్చి కార్మికుల రక్తమాంసాలను పీల్చిపిప్పి చేయడమే లక్ష్యంగా పని చేయించుకుంటున్నారు. బాయిలర్‌ను క్లీన్ చేస్తున్న కార్మికులకి కనీసం సేఫ్టీ రోప్ కూడా ఇవ్వలేదు. ఫలితంగా సచిన్ అనే కార్మికుడు ప్లాంటు ఆవరణలో వందల మీటర్ల ఎత్తు నుంచి కింద పడి చనిపోయాడు.

స్వరాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్ర కీలకం

అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్



జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్



జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఖమ్మంసహకారనగర్: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన సేవలు తెలంగాణ ప్రజానీకం ఎప్పటికీ మరచిపోరని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని ఐడీఓసీలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ అని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాంతం కష్టపడ్డారన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన చేసిన సూచనలు, సలహాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు.

తెలంగాణ స్వాప్నికుడు..

తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడిగా ఉద్యమ భావజాల వ్యాప్తికి తన జీవితాన్ని అర్పించిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. ఆదివారం జెడ్పీ కార్యాలయంలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రొఫెసర్ పోరాడారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగేళ్లలో అభివృద్ధికి పెద్దపీట

- సంతృప్తినిచ్చిన దళితబంధు పథకం
- విలేకరుల సమావేశంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

ఖమ్మంసహకారనగర్: జిల్లా పరిషత్ చైర్మన్‌గా తాను పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాను అభివృద్ధి పనులకే పెద్దపీట వేసినట్లు లింగాల కమల్‌రాజ్ తెలిపారు. ఈ నెల 7(సోమవారం)తో జెడ్పీ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయి ఐదో సంవత్సరంలో అడుగుపెడుతున్న క్రమంలో ఆదివారం జిల్లా పరిషత్‌లోని తన చాంబర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఇప్పటి వరకు రూ.30.54 కోట్లతో 721 పనులు చేపట్టగా.. 440 పనులు పూర్తి కాగా 281 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. పార్టీ మధిర నియోజవకర్గ ఇన్‌చార్జ్‌గా ఉండటంతో నియోజకవర్గాన్ని సైతం తనవంతుగా అభివృద్ధి చేశానన్నారు. మధిరలో ట్యాంక్‌బండ్, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు తదితర అభివృద్ధి పనులు చేశామన్నారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలుగా 30 మంది చనిపోతే వారి కుటుంబాలకు ఇన్సూరెన్స్ కింద ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున రూ.60 లక్షలు అందజేశామన్నారు. దళితబంధు పథకం ద్వారా చింతకాని మండలం పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక కాగా 3,462 మందిని ఎంపిక చేసి ఒక్కొక్క అభ్యర్థికి రూ.10 లక్షలు చొప్పున రూ.346.20 కోట్లు విడుదల చేయించామని చెప్పారు. తన హయంలోనే కారుణ్య నియామకాల కింద 55 మందికి ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్ర రవాణాశాఖామంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు, అధికార యంత్రాంగం అందరి సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని, దీనికి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నామని తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

తల్లాడ: మండలంలోని లక్ష్మీనగర్ గ్రామం వద్ద ఆదివారం మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారు. లక్ష్మీనగర్‌కు చెందిన పూల లక్ష్మీనరసమ్మ పశువులను మేపేందుకు సమీపంలోని పొలాలకు వెళ్లింది. పశువులు మేపుతుండగా కొత్తగూడెం రోడ్డు వద్ద మోటార్ సైకిల్ ఆపి ఇద్దరు వ్యక్తులు మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును లాగారు. ఆమె గట్టిగా పట్టుకోగా వారు బలవంతంగా గుంజడంతో మెడ వద్ద గాటు పడి తెగింది. దీంతో వారు గొలుసును తీసుకుని పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు.

సంక్షేమ హాస్టళ్లను అధికారులు పర్యవేక్షించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వైరా: సంక్షేమ వసతి గృహాలను అధికారులు తరచూ పర్యవేక్షిస్తూ విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. ఆదివారం వైరాలోని సంక్షేమ బాలుర హాస్టల్‌ను ఆయన సందర్శించి విద్యార్థుల సంఖ్య, భోజన వసతి, స్టోర్ రూం, టాయిలెట్, డార్మిటరీ పరిశీలించారు. హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో లోటుపాట్లు ఉంటే సంబంధిత హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చదువును ఆయుధంగా చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక వార్డెన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం దాగుడుమూతలు ఆపాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూఎస్‌పీసీ బాధ్యులు

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో యూఎస్‌పీఎస్‌సీ నాయకులు

ఖమ్మంసహకారనగర్: ఉద్యోగుల వేతన సవరణ, మధ్యంతర భృతి మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం దాగుడుమూతలు ఆపాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ (యూఎస్‌పీఎస్‌సీ) సభ్యులు దేవరకొండ సైదులు, సయ్యద్ షౌకత్ అలీ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి అధ్యక్షతన జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 12 జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్, మహాధర్నా నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహబూబ్ అలీ, ఎస్.విజయ్, పి.నాగేశ్వరరావు, ఎస్.రామకృష్ణ, షేక్ మన్సూర్, వి.వెంకటేశ్వరరావు, బి.బాబూరావు, బి.బస్సీలాల్, షేక్ మహబూబ్, పి.వెంకన్న, పి.శ్రీనివాస్, బీఆర్‌కే రాజు, మహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి విద్యార్థి ఆత్మహత్య



రెహాన్ (ఫైల్)

చుంచుపల్లి: విద్యానగర్ పంచాయతీ రాంనగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి స్థానిక చింతల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న రెహాన్ (19) శుక్రవారం తనతో పాటు కాలేజ్‌కు సెల్‌ఫోన్ తీసుకెళ్లాడు. అది గమనించి ప్రిన్సిపాల్ కాలేజ్‌లోకి సెల్‌ఫోన్ అనుమతి లేదని, ఇంకోసారి తీసుకురావొద్దని మందలించారు. సాయంత్రం ఇంటికి వచ్చిన రెహాన్ రాత్రి 8గంటల సమయంలో స్నేహితుడి బర్త్‌డే ఉందని బయటకు వెళ్లి వచ్చాడు. 10 గంటలకు ఇంట్లో మొబైల్‌ను పెట్టి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో వెతికిన తల్లిదండ్రులు శనివారం చుంచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం విద్యానగర్ చింతల చెరువులో శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకొని అతను రెహాన్‌గా గుర్తించి వివరాలు సేకరించారు. అనంతరం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మందలించడంతోనే రెహాన్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు, ముస్లిం విద్యార్థి సంఘాలు బస్టాండ్ సెంటర్‌లో నిరసనకు దిగే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రెహమాన్, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ అక్కడకు చేరుకొని తగిన న్యాయం జరిగేలా చూస్తామని సర్దిచెప్పి పంపారు. చుంచుపల్లి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి...

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని అశోక్‌నగర్‌కి చెందిన పెనక శంకర్ (40) ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. పది రోజులు కిందట తన భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన శంకర్ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ మృతదేహాన్ని తన సొంత గ్రామం పాఖాలకు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో కలెక్టరేట్ ఉద్యోగి మృతి



వి.వాసు మృతదేహం

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రోడ్డులో ఆదివారం కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో కలెక్టరేట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న వి.వాసు (49) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. వి.వాసు కామేపల్లి మండలం తాళ్లగూడెం నుంచి ఖమ్మంకు ద్విచక్రవాహనంపై మరొకరితో కలిసి వస్తున్నాడు. మంచుకొండ పెట్రోల్ బంక్ సమీపంలో ఖమ్మం నుంచి ఇల్లందు వైపు వెళ్తున్న కారు ఆటోని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదే ఆటోతోపాటు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాసు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరొకరు, ఆటోలో ఉన్న దంపతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు...



పవన్‌కల్యాణ్ (ఫైల్)

గుండాల: హైదరాబాద్ నుంచి పస్రా మీదుగా గుండాలకు ముగ్గురు బైక్‌పై వస్తుండగా ఆదివారం తెల్లవారుజామున ములుగు సమీపంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని రోళ్లగడ్డ తండాకు చెందిన గుగులోత్ ఈరు కుమారుడు పవన్‌కల్యాణ్ (20), భూక్యా నితిన్ నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారితో పాటు వారి బంధువు మెదక్ జిల్లాకు చెందిన రాంబాబు కూడా వారితోనే ఉంటున్నాడు. ఆ ముగ్గురు ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై గుండాలకు వస్తున్నారు. తెల్లవారుజామున ములుగు జిల్లా జంగాలపల్లి గట్టమ్మగుడి సమీపంలో ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో రాంబాబు, పవన్‌కల్యాణ్ అక్కడికక్కడే మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. నితిన్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాలతో పాటు నితిన్‌ను ములుగు ఆస్పత్రికి తరలించారు. కాగా, అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లారీని తప్పించబోతుండగా మరోలారీ ముందు భాగం తగిలి కిందపడి మృతిచెందారని పోలీసులు చెబుతుండగా కుటుంబ సభ్యులు మాత్రం ఏదో వాహనం ఢీకొట్టి ఉంటుందని ఆరోపిస్తున్నారు.

మృతదేహం గుర్తింపు

చింతకాని: మండలంలోని పాతర్లపాడు వరి పొలాల్లో పడి ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. పోలీసులకు విషయం తెలపడంతో వారు విచారణ చేపట్టి మృతుడు పాతర్లపాడుకే చెందిన పొట్టా రమేశ్ (40)గా గుర్తించారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన రమేశ్.. ఈ నెల 4వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబీకులు రమేశ్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నప్పటికి తెలియలేదు. గ్రామ సమీపంలోని వరి పొలాల్లో పడి ఉన్న మృతదేహాన్ని రమేశ్‌దిగా గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి గోపయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆఖరి కోరిక తీరింది..

కుమారుడి సంరక్షణలో తండ్రి కన్నుమూత

అశ్వాపురం: మావోయిస్టు పార్టీలో ఉన్న కుమారుడిని చూడాలని ఆ తండ్రి కోరుకున్నాడు. చనిపోయేవరకైనా చూడాలని పరితపించాడు. అతడి కోరిక తీరింది. కుమారుడిని చూసి, అతడి సంరక్షణలోనే ఆ తండ్రి కన్నుమూశాడు. ఈ ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని చింతిర్యాల గ్రామానికి చెందిన యక్కటి సత్యనారాయణరెడ్డి (106)కి కుమార్తె, కుమారుడున్నారు. కుమారుడు యక్కటి సీతారాంరెడ్డి చిన్నతనంలోనే మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడై ఇంట్లోంచి వెళ్లాడు. పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగాడు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నా సీతారాంరెడ్డి ఇంటికి రాలేదు. తన కొడుకును చివరిచూపు అయినా చూడాలని తల్లి, తండ్రి ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశారు. కొడుకు ఇంటికి రావాలని పత్రికలు, టీవీ చానళ్ల ద్వారా వేడుకున్నారు. తల్లి తన కోరిక తీరకుండానే మృతి చెందింది. ఇటీవల సీతారాంరెడ్డి పోలీసుల ఎదుట లొంగిపోయి ఇంటికి వచ్చాడు. కొన్ని నెలలుగా సీతారాంరెడ్డి తండ్రితోనే ఉంటున్నాడు. కుమారుడి సంరక్షణలోనే ఆదివారం సత్యనారాయణరెడ్డి మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముత్తినేని సుజాత, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Direct Final Year Discontinued (OR) Fail B.Tech, M.Tech, LLB, Degree, P.G, B.Sc అగ్రి, నర్సింగ్, GNM, MBA, BPT, MPT, Ph.D. Cell: 9494903629, 9951627995. [W-785638]

FLAT FOR SALE
కొత్తగూడెం గౌతమ్‌నగర్ ఏరియాలో 3 అంతస్తుల బిల్డింగ్ అమ్మబడును. పడమర ముఖం కొత్త డబుల్ బెడ్ రూం ఫ్లాట్లు కబోర్డ్స్ కలిగి ఉంది 1కోటి 50లక్షలు, బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. 9398923124 [G-861]

PLOT FOR SALE
ఖమ్మం నుండి మారెమ్మ టెంపుల్ రోడ్ HP పెట్రోల్ బంక్ దగ్గర వెంచర్‌లో 196 గజాల ఈస్ట్ పేసింగ్ ఓపెన్ ప్లాట్ అమ్మబడును. స్పాట్ రిజిస్ట్రేషన్. 79938 41894. [M-1221481]

Services

మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]

GOLD FINANCE
బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర: ✆ 945 945 3338 [B-382]

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781998]

బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర।। ✆ 99481 66555. [B-1193211]

బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర. ✆ 99121 05656. [M-9930]

OLD AGE HOME
త్రివేణి హోంకేర్ వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి,వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును .ఫోన్: 9160900023, 9160900024 [H-189316]

BUSINESS OFFER
RUTHUPARA PRAWNS. 50 Franchises in Telangana -2.5L. 50Kg's vacuum packed prawns/ day. Rs.600/kg pack (peeled, cleaned, ready-to-cook). Rs.60 Margin/pack. Contact: 8328099433 [WB-19219]

Wanted

NIELSEN సర్వే చేయుటకు జిల్లాలోని అన్ని మండలాలలో సర్వే చేయుటకు స్త్రీ/పు వర్కర్స్ కావలెను. మండలానికి ఇద్దరు చొప్పున. Qly.: 10th ఆపైన, మంచి జీతం. సంప్ర. 90590 88722. [M-1221510]

ప్రముఖ కంపెనీ నందు ఆఫీస్ ఇంఛార్జెస్ స్త్రీ/పురుషులు కావలెను. Age : 27 సం।। పైన, చక్కటి ఆదాయం & ఇన్సెంటివ్స్ అదనం. ఖమ్మం. R. రాజేశ్వరి-9989605913, AK రావు-8142492999 [M-1221482]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్: 9640258899, 9640468899 [HA-189314]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

నిబద్ధతతో పనిచేస్తే అత్యున్నత స్థాయికి

ఆత్మీయ సన్మానసభలో హైకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి నవీన్‌రావు



జస్టిస్ నవీన్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

ధర్మారం(ధర్మపురి): నిబద్ధతతో పనిచేస్తే అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని హైకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పాను గోటి నవీన్‌రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన జస్టిస్ నవీన్‌రావు, జిల్లా కోర్టు రిటైర్డు పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరిశంకర్‌రావును ఆదివారం రైతువేదిక సమావేశ హాల్‌లో హైకోర్టు ఏజీపీ సాయిరాం మున్నా ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆత్మీయ పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ నవీన్‌రావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగాల్లో కష్టపడి ఎదిగి అత్యుత్తమ స్థానంలో నిలవాలని ఉద్బోధించారు. నంది మేడారం రిజర్వాయర్ టూరిజం అభివృద్ధికి, మేడారం శివారు ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు తన వంతు ప్రయత్నాలు చేస్తానని తెలిపారు. మేడారంలో జూనియర్ సివిల్ జడ్జి- జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు భవన నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని హామీనిచ్చారు.

సీఎంకు పీఆర్టీయూటీఎస్ నేతల కృతజ్ఞతలు



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీఆర్టీయూటీఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో పీఆర్సీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి అసెంబ్లీలో స్పష్టం చేయడం పట్ల ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, తెలంగాణ (పీఆర్టీయూటీఎస్) నేతలు హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మిగులు నుంచి లోటుకు..

▶ మొదటి పేజీ తరువాయి

గణాంకాలను వెల్లడించింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ ప్రభుత్వ శాఖల ఆర్థిక పారదర్శకతపై ఆడిట్ నిర్వహించి కాగ్ రూపొందించిన నివేదిక అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం సభ ముందుంచకపోవడం గమనార్హం.

2021–22 అకౌంట్ల నిర్వహణలో కాగ్ గుర్తించిన ముఖ్యాంశాలు

- 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి అడ్వాన్సులు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో కనీస నగదు నిల్వ ఉంచింది 76 రోజులు. స్పెషల్ డ్రాయింగ్ సౌకర్యం (ఎస్‌డీఎఫ్) వినియోగించుకుంది 30 రోజులు. వేజ్ అండ్ మీన్స్‌కు వెళ్లింది 159 రోజులు. ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లింది 100 రోజులు.
- అడ్వాన్సులు తీసుకున్న 289 రోజుల్లో (ఎస్‌డీఎఫ్ 30, వేజ్ అండ్ మీన్స్ 159, ఓడీ 100 రోజులు కలిపి) ఎస్‌డీఎఫ్ కింద రూ.9,636 కోట్లు, వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సుల రూపంలో రూ.34,969 కోట్లు వినియోగించుకుంది. ఓడీ కింద రూ.22,669 కోట్లు తెచ్చుకుంది.
- 2021–22 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అప్పుల రూపంలో తెచ్చిన రూ.42,936 కోట్లు, ప్రజాపద్దు కింద వినియోగించాల్సిన రూ.3,773 కోట్లను ద్రవ్యలోటు కింద చూపెట్టారు.
- ఆర్థిక జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బీఎం) కింద 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఇందులో రెవెన్యూ మిగులుతో ఖజానా నిర్వహించాలనేది మొదటి లక్ష్యం కాగా, రూ.9,335 కోట్లు రెవెన్యూ లోటు ఏర్పడింది. జీఎస్‌డీపీలో 3 శాతానికి మించకుండా ద్రవ్యలోటు ఉండాలనేది రెండో లక్ష్యం కాగా, అది 4.06 శాతంగా నమోదైంది. నికర అప్పులు జీఎస్‌డీపీలో 25 శాతం మించవద్దనే మూడో లక్ష్యం కూడా నెరవేరలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి జీఎస్‌డీపీలో 27.40 శాతం అప్పులు మిగిలాయి.
- రెవెన్యూ రాబడుల కింద వచ్చిన రూ.1,27,468 కోట్లలో దాదాపు 50 శాతం అనివార్య వ్యయం కిందనే ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఇందులో రూ.30,375 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలకు, రూ.19,161 కోట్లు వడ్డీ చెల్లింపులు, రూ.14,025 కోట్లు పింఛన్ల కింద ఖర్చు పెట్టారు.
- ఏప్రిల్ 1, 2021 నాటికి రాష్ట్ర ప్రభుత్వ నికర అప్పులు రూ.2,78,017.64 కోట్లు. ఆ ఏడాదిలో తీసుకున్న అప్పులు రూ.43,593.94 కోట్లు. 2022 మార్చి 31 నాటికి నికర అప్పులు రూ.3,21,611.58 కోట్లు.
- పలు కార్పొరేషన్లు, సంస్థలకు రుణాలు తీసుకునేందుకు గాను రూ.40,449 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం గార్యంటీ ఇచ్చింది. దీంతో 2022 మార్చి 31 నాటికి ప్రభుత్వ నికర గ్యారంటీల మొత్తం రూ.1,35,283 కోట్లకు చేరింది.
- మొత్తం అప్పుల్లో రూ.28,883 కోట్లు మూలధన వ్యయం కింద, రూ.8,469 కోట్లు రుణాలు, అడ్వాన్సుల చెల్లింపులకు వెచ్చించారు. జీఎస్‌డీపీకి సమాంతరంగా మూలధన వ్యయం లేదు. జీఎస్‌డీపీలో 2.51 శాతం మాత్రమే మూలధన పద్దు కింద వెచ్చించారు.
- వివిధ మేజర్ పద్దులను ఆడిట్ చేయగా, ఉండాల్సిన నగదు నిల్వ కంటే తక్కువ ఉంది.
- 2021–22 ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రభుత్వ పథకాల అమలుకు గాను కేంద్రం నేరుగా ఇచ్చిన రూ.18,392 కోట్లు ప్రభుత్వ అకౌంట్లలో కనిపించలేదు. తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ లిమిటెడ్, తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లకు పలు పథకాల అమలు కోసం ఈ నిధులను కేంద్రం ఇచ్చింది.
- హౌసింగ్, పరిశ్రమల శాఖలకు బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం కంటే చాలా తక్కువ ఖర్చు పెట్టారు. బడ్జెట్ అంచనాల రూపకల్పనలో ఆయా శాఖలకు స్పష్టత లేని కారణంగానే ఇది జరిగింది.
- ఇక ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కంట్రిబ్యూటరీ పింఛన్ పథకం కోసం ప్రతి నెలా వసూలు చేసే మొత్తంలో రూ.2,074.22 కోట్లు మాత్రమే నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్)కు జమ చేసింది. మరో రూ.313.72 కోట్లు జమ చేయాల్సి ఉంది.

వివిధ స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు 2021-22లో విడుదల చేసిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ వివరాలు

సంస్థ	గ్రాంట్ ఇన్ ఎయిడ్ (రూ.కోట్లలో)
జిల్లా పరిషత్‌లు	4,615.15
పంచాయతీ సమితులు	1,137.38
గ్రామ పంచాయతీలు	2,768.15
మున్సిపల్ కార్పొరేషన్లు	685.79
మున్సిపాలిటీలు	1,010.18
చట్టబద్ధ కార్పొరేషన్లు	3,369.57
యూనివర్సిటీలు	1,031.76
అభివృద్ధి సంస్థలు	355.47
సహకార సంస్థలు	166.94
ఎన్జీవోలు	599.61
ఇతర సంస్థలు	43,327.03

(ఈ ఏడాదిలో మొత్తం రూ. 61,399.70 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో వివిధ సంస్థలకు ఇవ్వగా, అందులో రాష్ట్ర నిధులు రూ. 58,630.60 కోట్లు కాగా, కేంద్రం ఇచ్చిన నిధులు రూ. 2,769.10 కోట్లు)

బడ్జెట్ కన్నా అధికంగా, తక్కువగా వ్యయం (రూ.కోట్లలో) చేసిన శాఖల వివరాలు

అధిక వ్యయం చేసిన శాఖలు

శాఖ	బడ్జెట్ కేటాయింపు	ఖర్చు	తేడా శాతం
వైద్య, ఆరోగ్యం	381	509	34
పంచాయతీరాజ్	5,167	5,734	11
సాగునీటి శాఖ	11,490	12,071	5

తక్కువ ఖర్చు చేసిన శాఖలు

శాఖ	బడ్జెట్ కేటాయింపు	ఖర్చు	తేడా శాతం
హౌసింగ్	7,222	252	97
పరిశ్రమలు	1,686	286	83
పౌరసరఫరాలు	1,584	548	65
పురపాలక శాఖ	8,617	3,461	60

ప్రొఫెసర్ జయశంకర్‌కు సీఎం కేసీఆర్ నివాళి

- అసెంబ్లీహాల్‌లో జయశంకర్ చిత్రపటానికి మంత్రుల నివాళి
- జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పాలన: కేటీఆర్



దివంగత ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దివంగత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా అసెంబ్లీహాల్‌లోని ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నివాళులర్పించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌తో పాటు మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, చీఫ్‌విప్ దాస్యం వినయ భాస్కర్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు, పలువురు ఎమ్మెల్యేలు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. శాసన మండలి ప్రాంగణంలో జయశంకర్ చిత్రపటానికి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, చీఫ్‌విప్ భానుప్రసాదరావుతో పాటు పలువురు ఎమ్మెల్సీలు నివాళులర్పించినవారిలో ఉన్నారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని మంత్రి కేటీ రామారావు అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి కేటీఆర్ పార్టీ నేతలతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్రను నేతలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు పలు కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మంత్రుల నివాస సముదాయంలో

జయశంకర్ జయంతి సందర్భంగా మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆయన చిత్రపటం వద్ద రాష్ట్ర రోడ్లు భవనాలు, శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నివాళి అర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ తన జీవిత కాలం తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం కృషి చేశారన్నారు.

ఎస్సై ఫలితాల వెల్లడి

- 587 ఉద్యోగాలకు 434 మంది పురుషులు, మహిళలు 153 మంది ఎంపిక
- నేడు వెబ్‌సైట్‌లో తుది ఎంపిక అభ్యర్థుల జాబితా
- నియామక బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా వివిధ విభాగాల్లో ఎస్సై, ఏఎస్సై పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి ఆదివారం విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితా పోలీస్ నియామక మండలి వెబ్‌సైట్‌లో సోమవారం ఉదయం నుంచి అందుబాటులో ఉండనుంది. ఈ మేరకు పోలీసు నియామక మండలి చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. వివిధ విభాగాలకు చెందిన 587 ఉద్యోగాలకు 434 మంది పురుషులు, 153 మంది మహిళల్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎస్సై,ఏఎస్సై పోస్టులకు సోమవారం నుంచి టీఎస్ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో కటాఫ్ మార్కుల కేటాయింపు, అభ్యర్థుల జన్మతేదీ వంటి వివరాలు వెల్లడిస్తామన్నారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 9 నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక ఫార్మాట్‌లో వారిపై ఉన్న కేసులు, మెడికల్ అంశాల వివరాలు అటెస్టేషన్ చేయించాలని సూచించారు. అటెస్టేషన్ కాపీని ఏ4 సైజులో ప్రింట్ తీసి, వాటిపై పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు అంటించి మూడు కాపీల్లో గెజిటెడ్ అధికారితో సంతకాలు చేయించి వాటిని సూచించిన కేంద్రాల్లో ఆగస్టు 14 నాటికి అందజేయాలని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో సందేహాల నివృత్తికి సైతం నియామక మండలి అవకాశం కల్పించింది. ఆగస్టు 7వ తేదీ నుంచి 9 వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో సందేహాలు నివృత్తికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు ఎస్సీ, ఎస్టీలకు రూ.2వేలు, ఇతరులకు రూ.3వేలు ఆన్‌లైన్‌లో చెల్లించాలని బోర్డు అధికారులు పేర్కొన్నారు.

'మత్స్యకారులంటే రాహుల్‌కు ప్రేమ'



మాణిక్ రావ్ ఠాక్రేకు జ్ఞాపికను ఇస్తున్న ఫెర్నాండో, సాయికుమార్. చిత్రంలో పొన్నాల, యాష్కీ

సాక్షి, హైదరాబాద్: చేపలు పట్టే సృజనాత్మకత కలిగిన మత్స్యకారులంటే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి ప్రేమ అని జాతీయ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఫెర్నాండో అన్నారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం చైర్మన్ మెట్టు సాయికుమార్ అధ్యక్షతన ఆదివారం గాంధీభవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రోహిన్ రెడ్డి, శత్రులతో పాటు ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఫెర్నాండో మాట్లాడుతూ రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీఇచ్చారు.

జిల్లా వార్తలు


ఆగమ కేసరి బిరుదు ప్రదానం



మారుతిశర్మను సత్కరిస్తున్న వేద పండితులు

దమ్మపేట: దమ్మపేటకు చెందిన ప్రముఖ జ్యోతిష్య, వాస్తు సిద్ధాంతి కామవరపు విజయమారుతిశర్మకు సిద్ధాంత, ఆగమకేసరి బిరుదు ప్రదానం చేశారు. ఏపీలోని ఏలూరు జిల్లా కేంద్రంలో ఆదివారం అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీగురు పురస్కారాల కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర దేవాదాయశాఖ సలహాదారు జ్వాలావరపు శ్రీకాంత్, పలువురు వేద పండితుల చేతుల మీదుగా విజయమారుతి శర్మ బిరుదు అందుకున్నారు.

12 నుంచి విద్యా, వైజ్ఞానిక తరగతులు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు ఇల్లెందులో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్ తెలిపారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ ఐదు దశాబ్దాల క్రితం అసమాన త్యాగాలతో నిర్మితమైందని, నాటి నుంచి నేటి వరకు శాస్త్రీయ విద్య కోసం పోరాడుతోందని చెప్పారు. సమ సమాజ స్థాపన, విద్యార్థుల హక్కుల కోసం జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ వంటి వారు తమ జీవితాలను త్యాగం చేశారని అన్నారు. వారి బాటలో పయనిస్తూ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రారంభోపన్యాసం చేస్తారని, సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తరగతులు బోధిస్తారని తెలిపారు. అనంతరం శిక్షణ తరగతుల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.దీపిక, సతీష్, వినయ్, కార్తీక్, పార్దువి, పృథ్వి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికలు ఇంకెప్పుడో.. ?

- త్రిశంకు స్వర్గంలో అకాడమీల ప్రవేశాలు
- రెండేళ్లుగా ఎంపికలకు దూరంగా శాట్స్
- విద్యాసంవత్సరంలో ప్రవేశాల గడువు ముగుస్తున్నా ముందుకు రాని వైనం
- ఇది అధికారుల నిర్లక్ష్యమేనని క్రీడాకారుల ఆవేదన



పరుగుపందెం పోటీల్లో విద్యార్థులు (ఫైల్)

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. అకాడమీల ప్రవేశాల కోసం ఏటా నిర్వహించే ఎంపికలను ఇప్పటి వరకు చేపట్టకపోవడమే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఇప్పటికే విద్యాసంవత్సరంలో ప్రవేశాల గడువు ముగుస్తున్నా ఇప్పటి వరకు అకాడమీలో చేరే క్రీడాకారులకు ఎలాంటి ఎంపికలను నిర్వహించకపోవడంలో అంత్యమేంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతేడాది కూడా ఇలాగే నిర్లక్ష్యం చేశారని, ఈ సంవత్సరం కూడా అంతేనా అనే మీమాంసలో క్రీడాకారులు కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా చూస్తే ఖమ్మంలో అథ్లెటిక్స్, వరంగల్‌లో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, వనపర్తిలో హాకీ, సరూర్‌నగర్‌లో వాలీబాల్ క్రీడాంశాల్లో అకాడమీలు కొనసాగుతున్నాయి. ఇందులో దాదాపు 150 మందికి పైగా క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. ప్రతి ఏటా జూన్ మొదటి వారంలో ఎంపికలు నిర్వహించి విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అకాడమీలను కొనసాగించేవారు. అయితే ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమయినా అధికారుల్లో నిర్లిప్తత కారణంగా ఈ ఎంపికలకు ఇంత వరకు మోక్షం లభించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించిన ఫైల్‌ను ఉన్నతాధికారులకు సమర్పించకపోవడమే జాప్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఎంపికల ప్రక్రియను ఏప్రిల్ లేదా మే నెలలో పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ దీనిపై ఇప్పటికీ కసరత్తు చేయకపోవడంతో క్రీడాకారులకు తీవ్రంగా నష్టం కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీలో మొత్తం 20 మంది క్రీడాకారులు ఉండాలి.. కానీ ప్రస్తుతం ఐదుగురు మాత్రమే ఉన్నారు. మిగిలిన అకాడమీల్లోనూ ఇలాగే ఉన్నట్లు తెలుస్తోంది. క్రీడాభివృద్ధి కోసం ఎంతో చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం అకాడమీల ఎంపికల నిర్వహణకు గడువు పూర్తి అవుతున్నా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థం కాని పరిస్థితి అని క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు. అయితే అకాడమీల నిర్వహణ కష్టతరమవుతోందనే నెపంతో వీటిని కొనసాగించాలా లేక మూసివేయాలా అనే తర్జన భర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అకాడమీలను యథావిధిగా కొనసాగించేందుకు శాట్స్ తక్షణం చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే శాట్స్‌కు క్రీడల పట్ల ఆసక్తి లేదని, ఏదో మొక్కుబడి కోసం రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామనే ఆపోహలు వస్తున్నాయని క్రీడా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఏజెన్సీ రైతులకు శుభవార్త

- ధరణి పోర్టల్‌లో నమోదైన భూములకు తనఖా రుణాలు
- వ్యవసాయ, దీర్ఘకాలిక, మార్ట్‌గేజ్, విద్యా లోన్లకూ అవకాశం
- మూడేళ్లుగా పడుతున్న రైతుల ఇబ్బందులకు తెర

ఖమ్మంవ్యవసాయం: ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయ భూములు కలిగిన రైతులకు అన్ని రకాల రుణాలు పొందే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ధరణి పోర్టల్‌లో భూముల నమోదు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఏజెన్సీ ప్రాంతంలోని భూములకు తనఖా రుణాలను నిలిపివేశారు. పోర్టల్‌లో భూములు నమోదై ఉన్నా రుణాలు ఇవ్వడంలేదు. అదే మైదాన ప్రాంత రైతులకు అన్ని రకాల రుణాలు అందిస్తున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు భూములను తనఖా పెట్టుకుని వ్యవసాయ రుణాలతోపాటు దీర్ఘకాలిక, మార్ట్‌గేజ్, విద్యారుణాలు అందిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో రుణాలు ఇవ్వకపోవడంతో అక్కడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం పంట రుణాలు మాత్రమే పొందుతున్నారు. ఈ సమస్యను వివిధ బ్యాంకుల ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లు, డీసీసీబీ బ్రాంచిలు విస్తరించి ఉండగా, రైతులకు రుణాలు అందించే విషయంపై ప్రభుత్వానికి అభ్యర్థనలు వెళ్లాయి. ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలక వర్గం కూడా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి, జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ల ద్వారా ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో కూడా ధరణి పోర్టల్ భూములు కలిగి ఉన్న రైతులకు భూములను తనఖా పెట్టుకుని అన్ని రకాల రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు అధిక ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ఖమ్మం జిల్లాలో కూడా ఏజెన్సీ ప్రాంత రైతులకు కూడా మేలు జరగనుంది. డీసీసీబీ పరిధిలో మొత్తం సుమారు లక్షన్నర మందికి ప్రయోజనం కలిగే అవకాశం ఉన్నట్లు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. ఇక ఇతర బ్యాంకుల నుంచి మరో లక్ష మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

పలువురికి ప్రయోజనం

ప్రభుత్వ నిర్ణయంతో ఏజెన్సీ ప్రాంతం రైతులకు ఎంతో ప్రయోజనం. మా బ్యాంకు నుంచి దీర్ఘకాలిక, మార్ట్‌గేజ్, విద్యారుణాలు అందిస్తాం. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

– కూరాకుల నాగభూషణం, చైర్మన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, ఖమ్మం

స్ఫూర్తి ప్రదాత జయశంకర్



జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర సాధర ఉద్యమాన్ని ముందుండి నడిపిన స్ఫూర్తి ప్రదాత ఆచార్య జయశంకర్ అని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా ఆదివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంత ప్రజలు అభివృద్ధిలో వెనుకబడ్డారనే ఆవేదనతో 1969 నుంచే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని నడిపించారని కొనియాడారు. ప్రజలు, యువతకు మనోధైర్యాన్ని ఉద్యమాన్ని ఉధృతం చేశారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆచార్య జయశంకర్ కృషి ఫలితంగానే సిద్ధించిన తెలంగాణలో నేటి ప్రభుత్వం ఆయన పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, హన్మకొండలో ఒక పార్కును ఏర్పాటు చేసిందన్నారు. జయశంకర్‌ను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు పట్టుదలతో పని చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు సేవ చేసి వారికి అందాల్సిన స్వయం ఉపాధి పథకాల గురించి తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి భీమ్, మేనేజర్ ఆదినారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఏసీ సురేష్ బాబు, డీటీ శ్రీనివాస్, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నరసింహారావు, వ్యవసాయశాఖ ఏడీ భాస్కరన్, డీఎస్ఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



జలాశయంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానికి జిల్లా నలుమూలల నుంచి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చి సందడి చేశారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం బోటుషికారు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 835 మంది పర్యాటకులు ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.23,480, 200 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం శాఖకు రూ.12,150 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం

ఖమ్మంగాంధీచౌక్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రతీ పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 25 చెల్లించి పోస్టాఫీసు నుంచి జాతీయ జెండా(20X30 సైజు) పొందవచ్చని సూచించారు. www.epostoffice.gov in అనే వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి పోస్టుమ్యాన్ ద్వారా జాతీయ జెండాను ఇంటి వద్దనే డెలివరీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

స్వయం పాలన సాధనకు ఉద్యమించండి

ఖమ్మంమయూరిసెంటర్ : ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ గిరిజనులందరూ సమైక్యంగా స్వయం పాలన సాధనకు ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కార్యదర్శివర్గ సభ్యుల కెచ్చెల రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజన వ్యతిరేక విధానాలను విడనాడాలని, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. పీసా చట్టం, 1/70 రెగ్యులేషన్, అటవీ హక్కుల చట్టం–2006ను సమగ్రంగా అమలు చేయాలని, జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని కోరారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు సాగుదారులందరికీ 10 ఎకరాల వరకు పట్టాలివ్వాలని, పాలకుల అడ్డగోలు ఆంక్షల విధింపులు మానాలని డిమాండ్ చేశారు. పోడుసాగుదారులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. ఆదివాసీ గిరిజనుల విద్య, వైద్యం, ఉపాధికి అవసరమైన నిధులు పెంచాలని, సాగునీరు, రోడ్లు, విద్యుత్, రక్షిత మంచినీరు ఇవ్వాలని కోరారు.